ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
గురువారం 28 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

# ఫుడ్ సేఫ్టీకి టాస్క్ ఫోర్స్

**కమిషనర్, అదనపు డైరెక్టర్, జిల్లా స్థాయి అధికారితో కమిటీ**

**ఉత్వర్వులు ఇచ్చిన ప్రభుత్వం**

హైదరాబాద్: ఇటీవల గురుకులాల్లో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ కేసులకు సంబంధించి కారణాలు తేల్చేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఫుడ్ సేఫ్టీ కమిషనర్, అదనపు డైరెక్టర్, జిల్లా స్థాయి అధికారితో కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గురుకులాలు, హాస్టళ్లు, అంగన్వాడీలు, ఆసుపత్రుల్లో ఆహార నాణ్యతను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనుంది. ఫుడ్ పాయిజన్ జరిగినప్పుడు కారణాలు తేల్చి, బాధ్యులను గుర్తించనుంది. పాఠశాల ఫుడ్ సేఫ్టీ కమిటీలో హెడ్ మాస్టర్, ఇద్దరు పాఠశాల సిబ్బంది ఉంటారని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వంట చేసే ముందు కిచెన్ పరిశీలించి పరిశుభ్రత నిర్ధారించాలి, ఫుడ్ సేఫ్టీ కమిటీ రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు ఆహారం వడ్డించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.

# పీడీ నోటిఫకేషన్ ఏదీ?

**30 రోజుల గడువుతో ఇది ఇవ్వాలి**

**పార్లమెంటును ప్రభుత్వం తప్పుదోవ పట్టించడం సిగ్గుచేటు**

**మూసీ ప్రాజెక్టుపై వాస్తవాలు దాచిపెడుతోంది**

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



హైదరాబాద్: పార్లమెంటును రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "మూసీ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలు దాచిపెడుతోందన్నారు. కేంద్రం, పార్లమెంటుకు ఒకటి చెప్పి మరొకటి అమలు చేస్తుందన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు పార్లమెంటుకు చెప్పారన్నారు. దేశంలో ఏ ప్రాజెక్టులోనైనా నిర్వాసితులను ఆదుకోవాలని 2013లో చట్టం తీసుకొచ్చారన్నారు. దానికంటే మెరుగైన చట్టం అమలు చేస్తే ఆయా రాష్ట్రాలు సొంతంగా కొత్త చట్టాలు తెచ్చుకునే వెసులుబాటు కల్పించారన్నారు. దీంతో బీఆర్ఎస్ హయాంలో మరింత మెరుగ్గా 2014లో భూసేకరణ చట్టం తీసుకువచ్చామన్నారు. నేడు అదే రాష్ట్రంలో అమలులో ఉందన్నారు. ఎన్యుమరేషన్ తర్వాత 60 రోజుల గడువు ఇచ్చి పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకొని మరో 30 రోజుల గడువు ఇస్తూ పీడీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. అభ్యంతరాలు నివృత్తి చేసిన తర్వాత ప్రక్రియ మొదలుపెట్టాలన్నారు. ప్రస్తుతం ఎన్యుమరేషన్ జరగలేదని, పీడీ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. డీపీఆర్ లేదు.. లబ్ధిదారులను గుర్తించలేదన్నారు.

## అప్పుడు ఇథనల్ కు అనుమతులు

# కేసీఆర్, కేటీఆరే ఇచ్చారు

**కంపెనీ మరో డైరెక్టర్ గా పుట్టా సుధాకర్ కుమారుడు**
**సుధాకర్ , తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకులు**
**గతంలో గ్రామసభ నిర్వహించకుండానే అనుమతులు**

**మంత్రి సీతక్క**



నిర్మల్ : దిలావర్ పూర్ లో ఇథనాల్ పరిశ్రమకు అన్ని అనుమతులు కేసీఆర్ , కేటీఆరే ఇచ్చారని మంత్రి సీతక్క అన్నారు. అనుమతులిచ్చే సమయానికి ఇథనాల్ కంపెనీ డైరెక్టర్ గా తలసాని సాయి ఉన్నారన్న ఆమె... ఇథనాల్ కంపెనీ మరో డైరెక్టర్ గా పుట్టా సుధాకర్ కుమారుడు ఉన్నారన్నారు. పుట్టా సుధాకర్ , తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకులని సీతక్క వెల్లడించారు. గతంలో గ్రామసభ నిర్వహించకుండానే అనుమతులిచ్చారన్న మంత్రి... తప్పు చేసి రెచ్చగొట్టి విధ్వంసాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే కేటీఆర్ దిలావర్ పూర్ రావాలన్న సీతక్క.. కంపెనీకి అనుమతులు ఎవరిచ్చారనేది అక్కడే తేలుస్తామన్నారు.

# ఏబీవీపీ నిరసన



కరీంనగర్ : రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ తెలంగాణ చౌక్ లో ఏబీవీపీ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని మృతి చెందిన ఘటనకు సంబంధించి కారకులను శిక్షించాలని నేతలు డిమాండ్ చేశారు..

## కేటీఆర్ పై ఐపీఎస్ అధికారుల సంఘం

# ఆగ్రహం



**సిరిసిల్ల కలెక్టర్ పై ఆరోపణలకు ఖండన**

**విశ్వసనీయతను ప్రశ్నించేలా ఉన్నాయని వ్యాఖ్య**

**నిరాధార ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి**

హైదరాబాద్ : సిరిసిల్ల కలెక్టర్ పై మాజీమంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన ఆరోపణలను తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. సివిల్ సర్వీస్ అధికారిపై ఆయన చేసిన విమర్శలు విశ్వసనీయతను ప్రశ్నించేలా ఉందని వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలు సివిల్ సర్వేంట్లకు నిర్వర్తించి బాధ్యతలకు విరుద్ధంగా ఉన్నాయని తప్పుపట్టింది. ఇటువంటి నిరాధార ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థలపై చెడు ప్రభావం చూపిస్తాయని చెప్పింది. సివిల్ సర్వీసుల గౌరవం కాపాడాటానికి తాము అండగా ఉంటామని తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం స్పష్టం చేసింది. కలెక్టర్ విధులను రాజకీయంగా వక్రీకరించడం సరికాదని చెప్పింది. విధి నిర్వహణ సామర్థ్యాన్ని దెబ్బతియడంతోపాటు పాలన పట్ల ప్రజలు ఎంతో నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తాయని హెచ్చరించింది. ఇటువంటి నిరాధార ఆరోపణలను వెంటనే వెనక్కితీసుకోవాలని కోరింది.

## ఖైరతాబాద్ ఆర్టీఓ ఆఫీస్ లో

# సినీ నటుడు నాగార్జున

**కొత్త కారు రిజిస్ట్రేషన్ కోసం రాక**



ఖైరతాబాద్ : సినీ హీరో నాగార్జున ఖైరతాబాద్ ఆర్టీవో ఆఫీసులో సందడి చేశారు. తన కొత్త కారు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చారు. కొత్తగా కొన్న టయోటా లెక్సస్ వెహికిల్ రిజిస్ట్రేషన్ కోసం ఫొటో దిగారు.



## జార్ఖండ్ సీఎంగా సోరెన్

# ప్రమాణం

రాంచి : జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేశారు. హేమంత్ సోరెన్‌తో గవర్నర్ ప్రమాణం చేయించారు. రాహుల్ గాంధీ, ఖర్గే, శరద్ పవార్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్, అఖిలేష్ యాదవ్, ఉదయనిధి స్టాలిన్, తేజస్వి యాదవ్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితర నేతలు హాజరయ్యారు. రాంచీలోని మోరబడి గ్రౌండ్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది.